

ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర

సంపుటి : 4 సంచిక : 29 పుష్పం : 35 ఎడిటర్ : శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)



## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, ఓడూరు, 15-4-99)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

విషయానందంలో ఉన్నంతకాలం మనకు జన్మలు వస్తాయి. విషయానందానికి ఇంద్రియాలు ఉండాలి. ఇంద్రియాలు ఉండాలంటే శరీరం ఉండాలి. విషయానందంనుండి విడివడి ఎవడైతే ఆత్మానందమును అనుభవిస్తున్నాడో వాడికి పునర్జన్మ ఉండదు. మతం అంటే పూజ చేయటమే మతం అనుకొంటున్నారు. సేవ చేయటం కూడా మతమే. మంచిపని చేయటం, మంచి మాట చెప్పటం కూడా మతమే. మన హృదయంలో ఉన్న సత్యం తప్పించి మిగిలినవి అన్నీ మనో కల్పితాలు. రోడ్డు మీద వెళ్లే మనుషులను మీరు పట్టించుకోరు అలాగే మీ మనస్సులో వచ్చే తలంపులను పట్టించుకోవద్దు అనేవారు భగవాన్. మనస్సులో వచ్చే తలంపులను పట్టించుకోకపోతే మీకు మానసికఆరోగ్యం బాగుంటుంది. మానసికఆరోగ్యం బాగుంటే శారీరక ఆరోగ్యం బాగుంటుంది. మనస్సు ఎలా చెపితే శరీరం అలా నడుస్తుంది. మనోనిగ్రహం అత్యంత ముఖ్యం. మహాత్ములు, మహర్షులు ఎప్పుడైనా మన మీద ఆగ్రహం చూపించినా మనకు మనోనిగ్రహం అలవాటు చేయటం కోసం ఆగ్రహం చూపిస్తారు. వారి ఆగ్రహం కూడా అనుగ్రహమే అని గుర్తించిన వారు ధన్యులు. మనస్సు బాహ్యముఖానికి వెళుతూ ఉంటే దుమ్ము అంతా పోగుచేసుకొని వస్తుంది. మనస్సు అంతర్ముఖం అవుతూ ఉంటే దానికి చల్లదనం, శాంతి తెలుస్తుంది. కేవలం శాస్త్రాలు చదవటం వలన అంతర్దృష్టి రాదు. శాస్త్రాన్ని చదివి, అర్థంచేసుకొని, అందులో చెప్పినట్లుగా ఎవరైతే జీవిస్తున్నారో వారి సాహచర్యం వలన మనస్సుకు అంతర్దృష్టి కలుగుతుంది.

మీరు మంచిపనులు చేస్తే పుణ్యం వస్తుంది దానికి సంతోషించేది మనస్సే. మీరు చెడ్డపనులు చేస్తే పాపం వస్తుంది. దానికి దుఃఖపడేది మనస్సే. ఆ మనస్సు అనే తెరను చింపేస్తే ఉన్న వస్తువు మీకు వ్యక్తమవుతుంది. మనస్సు అనే తెరను చింపాలి. సత్కర్మ చేయటం వలన మనస్సు పల్చబడి చిరిగిపోతుంది. అందువలన సత్కర్మ ఆచరించాలి. సత్కర్మ ఆచరించటానికే మనం జీవించాలి. అప్పుడు జ్ఞానోదయం అవుతుంది. హిందూమతంలో రాళ్లకు ఇస్తున్న విలువ మనుషులకు ఇవ్వటంలేదు. ఎవరైనా బాధపడుతూ ఉంటే ఆ బాధను అర్థంచేసుకొని ఆ మనిషికి చేయవలసినసహాయంచేయటం తగ్గిపోతోంది. జీవుడికి చేసే

సేవ శివుడికి చేస్తున్నట్లే అనే భావన పోయింది. కేవలం మన మతం రాళ్లకే పరిమితం అవుతోంది. మనందరికి భక్తి ఉంది గాని భక్తిని ఎక్కడకు గురిపెట్టాలో ఎవరికి తెలియటం లేదు. మనలో ఉన్న దోషం ఏమిటి అంటే మనగమ్యం మోక్షంగా పెట్టుకోవటంలేదు. మన అమ్మాయికి పెళ్లి అవ్వకపోతే పెళ్లిఅయిపోతే చాలు, అబ్బాయికి ఉద్యోగం రాకపోతే ఉద్యోగం వస్తే చాలు అని భక్తిని అక్కడకు పరిమితం చేస్తున్నాము. దేవుడు మనకు తండ్రి లాంటి వాడు. ఇలా ప్రార్థించటంలో తప్పులేదు. కాని మనలక్ష్యం మటుకు మోక్షంమీద ఉండాలి. ఆత్మజ్ఞానం సంపాదించాలి, ఏ స్థితిని పొందితే తిరిగి ఈ భూమి మీదకు రానక్కరలేదో ఆ స్థితిని పొందాలి అనే లక్ష్యం ఎంత మందికి ఉంది. ఎటువంటి స్థానమును పొందిన తరువాత తిరిగి రావలసిన పనిలేదో అటువంటి స్థానమును నీవుపొందటానికి ప్రయత్నంచెయ్యి అర్జునా అని గీతలో భగవంతుడు చెప్పాడు. ఆ ప్రసాదబుద్ధి, ప్రశాంతబుద్ధి మనకు రావాలి. ఆ బుద్ధి వస్తే గాని మన మనస్సు మోక్షం వైపుకు తిరగదు. చెవులతో మంచి మాటలు వినగా వినగా, చేతులతో సత్కర్మ చేయగా చేయగా మహాత్ముల అనుగ్రహానికి గురి అయితే మనస్సుకు, అంతర్ దృష్టి కలుగుతుంది, అప్పుడు మనకు ప్రసాదబుద్ధి కలుగుతుంది. ప్రసాద బుద్ధి వలన ఏదినిత్యం ఏది అనిత్యం, ఏది జ్ఞానం ఏది అజ్ఞానం అనే విచక్షణ మన మెదడుకు తడుతుంది.

పూర్వజన్మలో ఏ పనులు చేయటానికి మీరు ఎక్కువగా అలవాటు పడ్డారో ఆ పనులు ఈ జన్మలో తలంపులుగా వస్తాయి. తలంపులు వస్తున్నాయని భయపడకండి. పరమేశ్వరుని చింతిస్తూ ఉంటే ఏ తలంపులు అయితే మిమ్మల్ని బాధపెడుతున్నాయో ఆ తలంపులనుండి విడుదల చేస్తాడు. నీవు ఎక్కడ ఉన్నప్పటికి దేహప్రారబ్ధమును బట్టి గృహస్థాశ్రమంలో ఉన్నా, సన్యాసాశ్రమంలో ఉన్నా, ఎక్కడ ఉన్నా పొందవలసిన లక్ష్యం మీద నీ మనస్సును నిలబెట్టు. అల్ప విషయాల గురించి, స్వల్ప విషయాలు గురించి మీ కాలాన్ని పాడుచేసుకోవద్దు. నేను అనే తలంపే జీవుడు. ఆ నేను అనే తలంపు కనిపించటం అంటే పుట్టటం, కనుమరుగవటం అంటే చనిపోవటం. కనిపించినప్పుడు నేను అనే తలంపుకు దేహం, ఇంద్రియాలు, ప్రకృతి వస్తుంది. మరుగయినప్పుడు దేహం, ఇంద్రియాలు, ప్రకృతి అణిగిపోతాయి. మీరు చెడ్డవారు అంటే మీకు దుఃఖం వస్తుంది. నేను అనే తలంపుకే దుఃఖం వస్తుంది. మంచివారు అంటే సంతోషం వస్తుంది. నేను అనే తలంపుకే సంతోషం వస్తుంది. నేను అనే తలంపు లేనప్పుడు చెడ్డవారు అన్నా, మంచి వారు అన్నా అక్కడ దుఃఖంలేదు, సంతోషంలేదు సమానంగా ఉంటారు. పరమేశ్వరుని అనుగ్రహం వలన పరమేశ్వరుని ధ్యానం చేసి, మంచి విషయాలను శ్రవణంచేసి, మననం చేసి, వివేకాన్ని పెంచుకొని, హృదయం యొక్క లోతులను పెంచుకొంటూ ఉంటే ఏదోజన్మలో ఆయన అనుగ్రహం మనకు అందుతుంది. అప్పుడు హృదయంలో ఉన్న దివ్యమైన అనుభూతి మనకు కలుగుతుంది. ఆ దివ్యమైన అనుభవం పరమేశ్వరుని అనుగ్రహం వలన మనకు కలగాలి కాని మన తెలివి తేటల వలన కలుగదు. గురువు అనుగ్రహం లేకుండా

ఆత్మజ్ఞానం కలుగదు. ఒక జన్మలో మనం కష్టపడి సంపాదించినది గురువు అనుగ్రహం వలన మెరుపు మెరిసినట్లు ఒక్క క్షణంలో తెలుస్తుంది.

గాఢ నిద్రలో నేను అనే తలంపు యొక్క స్థూలరూపం అణిగిపోతుంది. అప్పుడు నీవు ఒక్కడివే ఉంటావు. అదే నీవు. ఆ గాఢ నిద్రలో ఉన్నస్థితి జాగ్రదావస్థలో కూడా ఉంది. దానిని నీవు గుర్తిస్తే బ్రహ్మజ్ఞానం కలుగుతుంది. అప్పుడు మరల ఈ ప్రకృతిలోనికి రానక్కరలేదు. అది పొందటానికి ప్రయత్నం చెయ్యి అప్పుడే నీవు వచ్చిన పని పూర్తి అవుతుంది. కొంత మంది ఏదైనా నష్టం వస్తే బెంగ పెట్టుకొంటారు. లాభంవచ్చినా, నష్టంవచ్చిన అంతా ప్రకృతే. ఎప్పుడైనా ఇబ్బందులు వచ్చినా నీవు నిగ్రహంగా ఉంటే, దైవానుగ్రహంకోసం ప్రయత్నం చేస్తూ ఉంటే ఆయన అనుగ్రహం నీకు అందుతుంది. మీకు నష్టం వచ్చింది అనుకోండి. దాని వలన ఏమీ పోలేదు అని మీకు అర్థమయితే మీకు దఃఖం రాదు. ఏదో పోయింది అని అనుకోవటం వలన దుఃఖం వస్తుంది. లాభం వచ్చింది అనుకోండి ఏదోపొందాము అని అనుకోవటం వలన గర్వం వస్తుంది. తాత్విక దృష్టితో చూసినప్పుడు ఇప్పుడు వచ్చిందీ లేదు, అప్పుడు పోయిందీ లేదు. దేహం చనిపోయినప్పుడు నేను చనిపోవాలి కదా. దేహం చనిపోయినా గాని నేను మిగిలే ఉన్నాను ఏమిటి అంటారు భగవాన్. అది దివ్యానుభవం, అది ఆత్మ, అది తానై ఉన్నాడు. అది మరణానుభవంద్వారా ఆయనకు అర్థమయ్యింది. అది దేవతలు అనుగ్రహించారు. అటువంటి అనుగ్రహం మనం కూడా పొందటానికి ప్రయత్నం చేయాలి. మన ప్రవర్తన ద్వారా వారి అనుగ్రహం పొందాలి. నీవు చేసే పని ఎలా ఉండాలి అంటే నీవు వచ్చి వెళ్లిన జాడ కూడా ఎవరికి తెలియకూడదు. మనకు ఎటువంటి తలంపులు వస్తున్నాయో ఉదయం, సాయంకాలం చూసుకోవాలి. మన ఆరోగ్యం గురించి రోజు ఎలా చూసుకొంటామో అలాగ మన ఆలోచనా తీరు ఎలా ఉంది, మన ప్రవర్తన ఎలా ఉంది అని ఏ రోజుకారోజు పరిశీలన చేసుకోవాలి. మనిషిరాగద్వేషములను బట్టి పనిచేస్తాడు. కాని మనం రాగద్వేషములను ఒక ప్రక్కన పెట్టి భగవంతుడు ఎలా చెపితే అలా పనిచేయాలి.

సత్యమైననేను నిర్మలంగా ఉంటుంది. నిశ్చలంగా ఉంటుంది. అసత్యమైన నేను ఆడంబరంగా ఉంటుంది, అశాంతిగా ఉంటుంది. మన హృదయంలో ఉన్న వస్తువు ఎలా ఉందో అలా ఉండగలిగితే అదే నిజమైన బోధ. బోధించటం అంటే వ్రాయటం, ప్రసంగాలు చేయటం కాదు. జ్ఞాని యొక్క మౌనం అజ్ఞాని యొక్క వాసనకి కోత. మనకు మారాలనే బుద్ధికలిగినప్పుడు ఇతరులు చెప్పినది మీకు సహకరిస్తుంది. నీవు జీవుడికి చేస్తున్న ప్రతీసేవకూడా శివుడికి చేస్తున్నట్లే. పూజ మతం అయితే మంచితనం మతంకాదా, సత్కర్మ మతంకాదా, సహృదయం మతంకాదా. కాని మనంపూజే మతం అనుకుంటున్నాము. చైతన్యంలో నుండి నేను అనే తలంపు వస్తోంది. నేను అనే తలంపులోనుండి ఇతర తలంపులు వస్తున్నాయి. తలంపులలో నుండి మాటలు, మాటల నుండి చేష్టలు వస్తున్నాయి. నేను అనే తలంపు ఎక్కడ పుడుతుందో

చూడు మనస్సు వెళ్ళి అక్కడ లయిస్తుంది. అదే సత్యజ్ఞానం. ఆధ్యాత్మిక మార్గంలో ఎప్పుడూ పోజిటివ్ గా ఉండాలి, నెగిటివ్‌గా ఉండకూడదు. నెగిటివ్‌గా ఉంటే ఎంతపూజ చేసినా నష్టపోతారు. పోజిటివ్‌గా ఆలోచిస్తే శాంతి వస్తుంది. ఆధ్యాత్మిక దృక్పథం పెరుగుతుంది. నెగిటివ్‌గా ఆలోచిస్తే అశాంతి వస్తుంది, భౌతిక దృక్పథం పెరిగిపోతుంది. ఎప్పుడైనా మీకు నెగిటివ్ తలంపులు వస్తే కంగారుపడకండి, ఇవి కూడా పోతాయి అనుకోండి, వాటిని గుర్తించకండి.

ఇప్పుడు మనం జాగ్రదావస్థలో ఉన్నాము. ఇప్పుడు కూడా మనలో సుషుప్తి అవస్థ ఉంది. మెలుకువలో దానిని పట్టుకోవాలి. దీనికి మనమనస్సు నిర్మలం అవ్వాలి. మనస్సుకు అంతర్ దృష్టి కలగాలి. మనం చేసేపని, చూసే చూపు, మాట్లాడే మాట మన మనస్సులో ఉన్న కాలుష్యం తగ్గటానికి సహకరించేదిగా ఉండాలి. మనం ఎన్నిపూజలు చేసిన, జపాలు చేసిన భగవంతుని అనుగ్రహం లేకుండా ఈశ్వరవాణి మనకు అర్ధంకాదు. మనకు కనిపిస్తున్న ప్రపంచానికి కూడా తల్లి ఉంది. అదే మాయ, మాయ గర్భంలోనుండి ఈ ప్రపంచం వచ్చింది. ఈ మాయను ఎవడైతే జయిస్తాడో వాడు మాత్రమే ఈ ప్రపంచంలోనుండి బయటపడగలడు. మనం శ్రద్ధగా శ్రవణం చేయగా చేయగా, మననం చేయగా చేయగా ఎప్పుడో మన జీవితంలో మలుపు వస్తుంది. మనం చేసిన మంచి, మనంచేసిన ప్రయత్నం వృధాపోదు. భగవంతుడు తగిన సమయంలో మనలను బహూకరిస్తాడు. ఈశ్వరుడు అంటే రాయి అనుకోవద్దు. ఈశ్వరుడు అంటే ఆత్మ, చైతన్యం. ఎప్పుడు, ఎక్కడ,. ఎలా జీవులను సత్కరించాలో ఆయన చేస్తూ ఉంటాడు, నీవు సాధన చేయగా చేయగా, కృషి చేయగా చేయగా భగవంతుని కృపవలన అహంకారము కరిగిపోతుంది.

దక్షిణామూర్తి బొమ్మను చూడండి కాలుక్రింద ఒకడిని త్రొక్కిపెట్టి ఉంచుతాడు. అది ఎవరు అంటే అహంకారము. నీవు ఎవరితో మాట్లాడుతూ ఉన్నా, ఏ పని చేస్తూ ఉన్నా, జీవితంలో ఏ వ్యవహారంలో ఉన్నా నీ అహంకారమును కాలుక్రిందత్రొక్కి ఉంచు అని దాని అర్ధం. ఎందుచేతనంటే అహంకారము పూర్తిగానశించాలి గాని అది ఉన్నంతసేపు ఎప్పుడు ఎలా విజృంభిస్తుందో చెప్పలేము. మనం కష్టపడి సంపాదించుకొన్న ఆధ్యాత్మిక సంపద అంతా చిల్లర విషయాలకు ఖర్చుపెడుతున్నాము. నీవు వివేకవంతుడివి అయితే అహంభావన ఎక్కడయితే ఉదయిస్తోందో అక్కడే త్రొక్కిపెట్టి ఉంచు. అది విజృభించకుండా చూసుకో. అది విజృభించిందా మన కంట్రోలులో అది ఉండదు. దాని కంట్రోలు లోనికి మనం వెళ్లిపోతాము. అందువలన అది విజృంభించకముందే దానిని మూలంలో అణిచిపెట్టిఉంచు.

Printed and published by P.S. Rama Raju at Shriram Graphics, Palakol ☎ 24776